

న్యాయం కోసం..
భార్యపై అనుమానంతో భర్త తన ఎనిమిది నెలల కుమారుడిని డ్రమ్ములో ముంచి చంపేసిన విషయం తెలిసిందే. దీంతో దేవనకొండ గ్రామస్తులు శుక్రవారం భారీ ధర్నా నిర్వహించారు. 8లో▸



జల్సాలకు అలవాటు పడి..
మద్యం, జల్సాలకు అలవాటు పడిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాల చోరీని ఎంచుకున్నాడు. పోలీసులు దొంగను అరెస్ట్ చేసి అపహరించిన మోటారు సైకిళ్లను రికవరీ చేశారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:17,097
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:16,995

న్యూస్‌రీల్

నేడు, రేపు ఉల్లి బహిరంగ వేలం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మార్కెట్ యార్డులో శని, ఆదివారాల్లో ఉల్లి బహిరంగ వేలం నిర్వహించనున్నామని.. ఈ వేలంలో రిటైలర్స్, హోల్‌సేలర్స్, హోటళ్లు, హాస్టళ్ల ఏజెన్సీలు పాల్గొనవచ్చని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతుల నుంచి మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన 2,800 టన్నుల ఉల్లికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతోనే గ్రామాల అభివృద్ధి

కర్నూలు(అర్బన్): గ్రామాల అభివృద్ధి పంచాయతీ కార్యదర్శులతోనే సాధ్యమవుతుందని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో పంచాయతీ కార్యదర్శుల మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయపరచి ప్రజలను భాగస్వాములను చేస్తే తప్పక గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. వ్యక్తిగత జీవితంలోను, విధి నిర్వహణలోను ప్రతి ఒక్కరూ పాజిటివ్ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు శిక్షణ పొందిన ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ గంగాధర్, ట్రెనింగ్ మేనేజర్ గిడ్డేష్, టీఓటీలు వి.జేమ్స్ కృపావరం, వి.ప్రభాకర్, ఎస్.అష్రఫ్ బాషా, పి.జగన్నాథం, డీకే దస్తగిరి పాల్గొన్నారు.

జీడీపీ నుంచి నీరు విడుదల

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్ట్ (జీడీపీ) రెండు గేట్లు ఎత్తి రెండు వేల క్యూసెక్కుల నీటిని హంద్రీ నదిలోకి శుక్రవారం విడుదల చేశారు. జీడీపీ నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీల కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 3.88 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం 12 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల నీటిని నిలువ ఉంచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఇరిగేషన్ ఈఈ పాండురంగయ్య, ప్రాజెక్టు చైర్మన్ మల్లికార్జున గౌడ్, డీఈ సుబ్బరాయుడు తెలిపారు.

గ్రీన్‌కో సోలార్ కంపెనీకి మరో 254 ఎకరాలు

నందికొట్కూరు: గ్రీన్‌కో సోలార్ కంపెనీకి మరో 254 ఎకరాలు కేటాయించేందుకు సిద్ధం చేస్తున్నట్లు నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ తెలిపారు. మిడుతూరు మండల పరిధిలోని పైపాలెం గ్రామ పొలిమేరలో 177 సర్వే నంబరులో భూములను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రీన్ కో సోలార్ కంపెనీకి భూములు ఇస్తే పొలాలకు వెళ్లేందుకు దారులు లేకుండా చేస్తారని జేసీకి రైతులు తెలిపారు. భూములు ఇవ్వకుండా అడ్డుకుంటామన్నారు. రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని జేసీ హామీ ఇచ్చారు. జేసీ వెంట ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ శానవాజ్ తదితరులు ఉన్నారు.

రానున్న ఐదు రోజులూ వర్షాలే!


కర్నూలు(అగ్రికల్చర్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఆదోనిలో 86.8 మి.మీ, అత్యల్పంగా కోసిగిలో 10.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అధిక వర్షాల వల్ల చిప్పగిరి, ఆదోని, మద్దికెర, గూడూరు తదితర మండలాల్లో పంటలకు భారీగా నష్టం జరిగింది. మొత్తం 683 హెక్టార్లలో కంది, పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. ఉల్లికి భారీగా నష్టం జరిగినప్పటికీ పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం. జిల్లా మొత్తంగా సగటున 29.7 మి.మీ వర్షపాతం నమోదైంది. రెండు రోజుల్లోనే 59 మి.మీ వర్షం కురిసింది. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా.. 87.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

మండలం	వర్షపాతం(మి.మీ.)
ఆదోని	86.8
మంత్రాలయం	66.2
ఆస్పరి	52.2
నందవరం	50.8
కౌతాలం	48
పత్తికొండ	40.2
చిప్పగిరి	38.4
పెద్దకడుబూరు	36.8
తుగ్గలి	36.2
మద్దికెర	35.6

కన్నీళ్లు తుడవని బీమా!

ఉచిత పంటల బీమాకు మంగళం

- ఉమ్మడి జిల్లాలో 6.25 లక్షల హెక్టార్లలో పంటల సాగు
- ప్రీమియం చెల్లించిన రైతులు 38,918 మంది మాత్రమే
- ఈ ఏడాది రైతులకు భారీగా నష్టాలు
- ఉచిత పంటల బీమా లేక 95 శాతం మందికి అన్యాయం
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లూ ఉచిత పంటల బీమా
- ఇటీవల కేంద్రం వాటాగా రూ.82.79 కోట్లు విడుదల



ఉమ్మడి జిల్లాలో పత్తి ప్రధాన వాణిజ్య పంట. ఇందులో పెట్టుబడి వ్యయం అధికం. పత్తికి వాతావరణ బీమా చేసుకోవాలంటే ఒక హెక్టారుకు రూ.5వేల ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ఐదు హెక్టార్లలో పత్తి సాగు చేసినట్లయితే ప్రీమియం కిందనే రూ.25 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు బీమాను విస్మరించినట్లుగా తెలుస్తోంది.

కర్నూలు(అగ్రికల్చర్): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని పక్కన పెట్టి కూటమి ప్రభుత్వం ప్రీమియం చెల్లింపు విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో రైతుల నుంచి స్పందన కరువైంది. జిల్లాలో అధిక వర్షాలతో ఈ ఏడాది రైతులు భారీగా నష్టపోతున్నారు. ఉల్లి, పత్తి, వేరుశనగ, కంది తదితర పంటలకు భారీ నష్టం జరుగుతోంది. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఏ కారణంతోనైనా పంటలు దెబ్బతిన్నప్పటికీ ఉచిత పంటల బీమా అన్నదాతకు అండగా నిలిచింది. ప్రస్తుతం ఆ పరిస్థితి కరువైంది. అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతింటుండగా.. పంటల్లో దిగుబడులు పడిపోతుండటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రీమియం చెల్లించిన రైతులకే బీమా కల్పిస్తుండటంతో లక్షల మంది రైతులు నష్టపోయే ప్రమాదం ఏర్పడింది.

ప్రీమియం చెల్లించింది 38,918 మంది రైతులే..

ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో ఖరీఫ్‌లో దాదాపు 6.25 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో రైతులు 6.75 లక్షల మంది. వాతావరణ ఆధారిత బీమా కింద ఖరీఫ్‌లో పత్తి, వేరుశనగ పంటలకు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద దాదాపు అన్ని ప్రధాన పంటలకు బీమా సదుపాయం ఉంది. కూటమి ప్రభుత్వం 2024-25 రబీ నుంచి ఉచిత పంటల బీమాకు మంగళం పలికి ప్రీమియం చెల్లింపు విధానం అమలులోకి తెచ్చింది. మొత్తం రైతుల్లో 5 శాతం మంది రైతులు కూడా ప్రీమియం చెల్లించని పరిస్థితి. 2024-25 రబీ పంటలకు సంబంధించి వాతావరణ ఆధారిత బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద ప్రీమియం చెల్లించిన రైతులకు పరిహారం ఎప్పటికి వస్తుందో తెలియకపోవడం గమనార్హం.

➤ కర్నూలు జిల్లాలో 4.20 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతున్నాయి. జిల్లాలో మొత్తం రైతులు 3.50 లక్షల మంది. ఒక్క పత్తి సాగే దాదాపు 2.15 లక్షల హెక్టార్లు. వాతావరణ బీమా కింద 11,997 మంది, ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద 21,386 మంది రైతులు మాత్రమే ప్రీమియం చెల్లించారు.

➤ నంద్యాల జిల్లాలో వరి ప్రధాన పంట. పత్తి, మినుము, కంది తదితర పంటలు కూడా సాగు చేస్తున్నారు. మొత్తం 2.25 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతున్నాయి. 3.25 లక్షల మంది రైతులు ఉన్నారు. వాతావరణ ఆధారిత బీమా కింద 4,392 మంది, ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద 1,143 మంది రైతులు మాత్రమే ప్రీమియం చెల్లించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లూ ఉచిత పంటల బీమా

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన మొదటి ఏడాది అంటే 2019-20లో కేవలం ఒక్క రూపాయి ప్రీమియంతో నోటిఫై చేసిన పంటలకు బీమా సదుపాయం కల్పించింది.
- 2020-21 నుంచి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది.
- నోటిఫై చేసిన పంటలు ఈ-క్రాప్‌లో నమోదైతే చాలు పంటల బీమా సదుపాయం కల్పించే ఏర్పాటు చేయడం విశేషం.
- 2019-20 నుంచి 2022-23 వరకు ఉచిత పంటల బీమా కింద అన్నదాతలకు చెల్లించిన పరిహారం రూ.1065.61 కోట్లు.
- ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే బీమా పరిహారం విడుదల చేయడం వల్ల రైతులకు ఊరట లభించింది.
- నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన వైఎస్సార్ ఉచిత పంటల బీమా దేశానికి ఆదర్శంగా నిలిచింది. రైతులకు ఎంతో మేలు కలిగింది.

ఇప్పటికీ ఉచిత పంటల బీమా ఫలాలు

కూటమి ప్రభుత్వం 2024 జూన్‌లో ఏర్పాటైంది. ఇప్పటికీ రైతులు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా ఫలాలను పొందుతుండటం విశేషం. ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకపోయినప్పటికీ తాజాగా కేంద్ర ప్రభుత్వ వాటా కింద రూ.82.79 కోట్ల ప్రయోజనం లభించింది. 2022 ఖరీఫ్, 2023 ఖరీఫ్, 2023-24 రబీ, 2024 ఖరీఫ్ పంటలకు సంబంధించి ఉచిత పంటల బీమా ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ మొత్తం కొద్ది రోజుల క్రితమే విడుదలైంది. కేంద్రం వాటా కింద ఒక్కో రైతుకు రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు ప్రయోజనం చేకూరింది. ఆయా సంవత్సరాలకు సంబంధించి రాష్ట్రం వాటా పరిహారం కూడా చెల్లించాల్సి ఉంది. అయితే ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

మున్సిఫ్ కోర్టు ఆవరణలో ఈ-సేవా కేంద్రం



ఈ-సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లాజడ్జి కబర్ధి

కర్నూలు: ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు న్యాయవాదులు, కక్షిదారుల సౌకర్యార్థం జిల్లా మున్సిఫ్ కోర్టు ఆవరణలో ఈ-సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి శుక్రవారం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్భుతమైన సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని కోర్టులకు సంబంధించిన సమాచారాన్ని కక్షిదారులకు ఈ-సేవా కేంద్రం ద్వారా అందుబాటులో ఉంటుందన్నారు. కక్షిదారులకు ఈ-కోర్టు సేవలు, సుప్రీం కోర్టు, హైకోర్టు, జిల్లా కోర్టుల తీర్పు కాపీలు, న్యాయపరమైన ఆదేశాలు, తీర్పు కాపీలను ఇక్కడ పొందవచ్చని జిల్లా జడ్జి తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్ చౌదరి, వెంకటేశ్వర్లు, న్యాయమూర్తులు, పలువురు న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

దసరా బిగ్‌సేల్ ఆఫర్ల పేరిట మోసాలు

- అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి



ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: సోషల్ మీడియాలో ఆకట్టుకునేలా ఫెస్టివల్ ఆఫర్స్, బిగ్ సేల్ అంటూ లింకులు పంపి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. తక్కువ ధర కదా అని ఆశ పడి వెంటనే లింకులు ఓపెన్ చేసి మోసపోవద్దని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వివిధ కంపెనీలకు చెందిన వస్తువులను కొనుగోలు చేయాలనుకుంటే గూగుల్ ప్లేస్టోర్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరలకు ఆన్‌లైన్‌లో వస్తువులు ఇస్తామంటే వాటిని నమ్మి మోసపోవద్దన్నారు. సోషల్ మీడియాలో లింకుల ద్వారా వచ్చే యాప్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ చేసుకోవద్దన్నారు. ఇలాంటి మోసాలపై వెంటనే సైబర్ క్రైం 1930 హెల్ప్‌లైన్ నెంబర్‌కు, www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

నేడు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్న డాక్టర్ ఏ.సిరి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నూతన కలెక్టర్‌గా నియమితులైన డాక్టర్ అట్టాడ సిరి శనివారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల మధ్య ఆమె బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది. కాగా, విజయవాడ నుంచి విమానంలో వచ్చిన ఏ.సిరికి ఓర్వకల్ విమానాశ్రాయంలో కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు కె.సందీప్‌కుమార్, భరత్‌నాయక్ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె రోడ్డు మార్గన కర్నూలులోని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకోగా డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ స్వాగతం పలికి విడిది ఏర్పాటు చేశారు. విశ్రాంతి తీసుకుంటున్న కలెక్టర్‌ను జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కలెక్టరేట్ ఏఓ శివరాముడుతో పాటు పలు శాఖల అధికారులు కలసి పరిచయం చేసుకున్నారు. కాగా, ఇప్పటి వరకు కలెక్టర్‌గా పనిచేసిన పి.రంజిత్‌బాషా శుక్రవారం సాయంత్రం రిలీవ్ అయ్యారు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో జీఏడీలో రిపోర్టు చేసుకునే అవకాశం ఉంది.



కలెక్టర్ డాక్టర్ ఏ.సిరికి స్వాగతం పలుకుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

జిల్లాలో సీజనల్ హాస్టళ్లు

- నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: వలస వెళ్లే తల్లిదండ్రులు తమ పిల్లలను వెంట తీసుకపోకుండా ఈ ఏడాది జిల్లాలో సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయనున్నట్లు డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడుమూరు, తుగ్గలి, పత్తికొండ, క్రిష్ణగిరి, ఆదోని, మంత్రాలయం, కౌతాళం, కోసిగి, హొళగుంద, హాలహర్వి, మద్దికెర, పెద్దకడబూరులో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటిని ఈ నెల నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెల వరకు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. హాస్టళ్లను నిర్వహించేందుకు ఆసక్తి ఉండి, సేవభావం కలిగిన పొదుపు, ఎన్జీవో సంఘాలు ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని డీఈఓ ఆఫీస్ పైభాగంలో ఉన్న సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. బ్లాక్ లిస్టులో ఉన్న ఎన్జీవో, పొదుపు సంఘాల గ్రూప్స్ దరఖాస్తుకు అర్హులు కాదని డీఈఓ పేర్కొన్నారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ అర్హుల వివరాలను పంపండి

కర్నూలు(అర్బన్): తమ కళాశాలల్లో పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కాపు, ఈబీసీ, వికలాంగ విద్యార్థుల వివరాలను వెంటనే పంపించాలని సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి బి.రాధిక కోరారు. శుక్రవారం ఉదయం ఆమె తన చాంబర్ నుంచి ఆయా కళాశాలలు, విద్యా సంస్థలకు చెందిన ప్రిన్సిపాల్స్‌తో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రస్తుతం కళాశాలల్లో జ్ఞానభూమి వీ2 లాగిన్‌లో ఇంకా 5,169 మంది విద్యార్థుల రిజిస్ట్రేషన్, 5995 మంది విద్యార్థుల బయోమెట్రిక్ ఆధార్ నిర్ధారణ, 2891 మంది విద్యార్థులకు సంబంధించి ప్రిన్సిపాల్స్ ఓటీపీ వివరాలు అందాల్సి ఉందన్నారు. అలాగే 12,945 మంది విద్యార్థుల ఫ్రెష్ రిజిస్ట్రేషన్స్‌కు బయోమెట్రిక్ అథెంటికేషన్, ప్రిన్సిపాల్స్ ఓటీపీ పూర్తి చేయాలన్నారు. ప్రిన్సిపాల్స్ అందరూ ఈ ప్రక్రియను ఈ నెల 15వ తేదిలోగా పూర్తి చేయాలని ఆమె కోరారు. అలాగే దరఖాస్తు చేసిన విద్యార్థులు గ్రామ/వార్డు సచివాలయాల్లోని విద్య, సంక్షేమ సహాయకుల లాగిన్ ద్వారా తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఫ్రెష్ రిజిస్ట్రేషన్ చేసుకునే ఎస్సీ విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్‌ను తప్పనిసరిగా ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిణి బి.రాధిక

టమాట ధర నేలచూపు!



మార్కెట్‌కు తీసుకొచ్చిన టమాట

- 25 కేజీల బాక్స్ ధర రూ.150

పత్తికొండ: ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా పత్తికొండ వ్యవసాయశాఖ సబ్ డివిజన్‌లో టమాట సాగవుతోంది. ఈ ఏడాది 6,400 హెక్టార్లలో సాగు చేశారు. రాష్ట్రంలో మదనపల్లి మార్కెట్ టమాట విక్రయాల్లో మొదటి స్థానం కాగా.. పత్తికొండ మార్కెట్ రెండో స్థానంలో ఉంటుంది. ఇలాంటి చోట టమాట రైతు గిట్టుబాటు ధర కోసం యుద్ధం చేయాల్సి వస్తోంది. దాదాపు 2,500 హెక్టార్లలో టమోట పంటలో ఇప్పుడే కోతలు మొదలయ్యాయి. అక్టోబర్ నుంచి జనవరి వరకు నిత్యం దాదాపు 20 లారీలకు పైగా టమోటలను రైతులు మార్కెట్‌కు తీసుకొస్తారు. అరంభంలో ప్రతి ఏడాది 2 నుంచి 3నెలల వరకు మంచి ధర పలుకుతుంది. అయితే ఈఏడాది కేవలం 15 రోజులు మాత్రమే ఓ మోస్తరు ధర పలికింది. పంట మంచి దిగుబడితో ఇప్పుడిప్పుడే కోతలకు వస్తుంది. ఇలాంటి తరుణంలో టమోట ధర నెలచూపులు చూస్తుండటంతో అన్నదాత కష్టం బూడిదిలో పోసిన పన్నీరవుతోంది. ఇక్కడ పండించిన టమాటకు తమిళనాడు, పాండిచ్చేరి, హైదారాబాద్, వరంగల్ మార్కెట్‌లలో మంచి డిమాండ్ ఉంటుంది. ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

జ్యూస్ ఫ్యాక్టరీ ఇంకెప్పుడు?

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పత్తికొండ-గుంతకల్ రహదారిలో జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థలం కేటాయించడంతో పాటు నిధులు కూడా మంజూరు చేశారు. పనులు ప్రారంభించిన కొన్ని నెలలకే అధికార మార్పిడి జరగడంతో కూటమి ప్రభుత్వం పనులను ఎక్కడికక్కడ నిలిపేసింది. రైతుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో కొద్ది రోజుల తర్వాత పత్తికొండ మండలం కనకదిన్నె వద్ద ఫ్యాక్టరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ ఖరీఫ్‌కే పనులు పూర్తి చేసి ప్రాసెసింగ్ యూనిట్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. అయితే పనులు పునాదుల దశలోనే ఉండిపోగా.. రైతుల కష్టాలు తీవ్రమయ్యాయి.

కష్టం మట్టిపాలే



ఒక ఎకరాలో టమాట సాగు చేశాం. 25 కేజీలు చొప్పున 12 బాక్స్‌లు మార్కెట్‌కు తీసుకొచ్చాం. ఒక్కో బాక్స్ రూ.150 పలికింది. రూ.10 కమీషన్ పట్టుకొని ఇస్తారు. కూలీలకు, రవాణాకే రూ.600 ఖర్చయింది. కష్టమంతా మట్టిపాలవుతోంది. ఇలాగైతే ఎలా బతికేది.

– శివ, టమాట రైతు, హోసూరు

గంప రూ.75



రైతుల బాధలు ఈ ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదు. రెండు ఎకరాల్లో టమాట పంట సాగు చేశాం. 20కేజీలు చొప్పున 20 గంపలు మార్కెట్ తీసుకొచ్చాం. గంప రూ.75 పలికింది. 8 మంది కూలీలు టమాట కోత కోశారు. ఆటోకు రూ.300 ఖర్చు. 20 గంపలు అమ్మితే రూ.300 మిగిలింది.

– రంగన్న, టమాట రైతు, రాజుల మండిగిరి

అప్పీల్ చేసుకున్న దివ్యాంగులకు మరోసారి పునః పరిశీలన

కర్నూలు(అగ్రికల్చర్): దివ్యాంగుల పింఛను పొందుతూ రీ వెరిఫికేషన్‌లో అనర్హత వేటు పడిన వారిలో అప్పీల్ చేసుకున్న వారికి మరోసారి పునః పరిశీలన జరగనుంది. కర్నూలు జిల్లాలో 4,731 దివ్యాంగుల పింఛన్లు, 17 హెల్త్ పింఛన్లపై అనర్హత వేటు వేశారు. నంద్యాల జిల్లాలో 4,099 దివ్యాంగులు, 64 హెల్త్ పింఛన్లపై అనర్హత వేటు పడింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం సెప్టెంబర్ నెలలోనే తొలగింపులు జరగాల్సి ఉంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సెప్టెంబర్ నెలలో యథావిధిగా పింఛన్లు పంపిణీ చేసింది. అనర్హత నోటీసులు అందుకున్న వారిలో 8,194 మంది దివ్యాంగులు అప్పీల్ చేసుకున్నారు. దీంతో వీరి వికలత్వాన్ని మరోసారి పరిశీలించనున్నారు. గతంలో జరిగిన రీ వెరిఫికేషన్‌కు రోజుకు 70 మందిని పంపారు. ఇందువల్ల డాక్టర్లపై ఒత్తిడి పెరగడంతో ప్రక్రియను హడావుడిగా ముగించినట్లు తెలుస్తోంది. తాజాగా చేపట్టనున్న పునఃపరిశీలనకు ఒక్కో హాస్పిటల్‌కు రోజుకు శారీరక వికలాంగులు 30 మంది, ఇతర కేటగిరీల వారు 20 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. పునః పరిశీలన రెండు నెలల పాటు జరగనుండటంతో అప్పటి వరకు పింఛన్లను యథావిధిగా పంపిణీ చేయనున్నారు.

క్లుప్తంగా

మీ ఇల్లు ఇలాగే ఉంచుతారా?

- పారిశుద్ధ్య లోపంపై జెడ్పీ సీఈఓ ఆగ్రహం
- 11 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

గోనెగండ్ల: ' మీ ఇల్లు ఇలాగే ఉంచుతారా.. పారిశుద్ధ్య పనులు చేయరా' అంటూ పంచాయతీ కార్యదర్శులపై జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని గంజిహళ్లి, గోనెగండ్ల గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గంజిహళ్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులు సరిగ్గా లేక చెత్తాచెదారం చేరి ఉండడటం, మురుగునీరు ఎక్కడ పడితే అక్కడ ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదని తెలియడంతో 11 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓ మణి మంజరిని సీఈఓ ఆదేశించారు. దీంతో షోకాజ్ నోటీసులు జారీ చేసి నాలుగు రోజుల లోపు తగిన సంజాయిషీ ఇవ్వాలని, లేదంటే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. మహిళ దుర్మరణం


గురులక్ష్మి దేవి (ఫైల్)

వెలుగోడు: ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఓ మహిళ దుర్మరణం చెందారు. వెలుగోడు శివారులోని గంగమ్మ మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే.. వెలుగోడు మేజర్ పంచాయతీలో ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గాదే రామాంజనేయులు తన పొలంలో యూరియా వేసేందుకు ట్రాక్టర్‌లో భార్య గురులక్ష్మీదేవి, కూలీలతో కలిసి వెళ్తున్నాడు.గాలేరు గంగమ్మ టర్నింగ్ వద్ద ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ఈ ఘటనలో గురులక్ష్మీదేవి అక్కడికక్కడే మృతిచెందగా, ఫైజూన్ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని స్థానికంగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అక్షరమే ఆయుధం



ప్రశ్నించే గొంతుకపై కక్ష సాధింపు..



అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కూటమి ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఒక నాయకుడు ప్రెస్‌మీట్‌లో చెప్పిన అంశాలను ప్రచురిస్తే కేసులు పెట్టడం తగదు. నిన్నటి వరకు సోషల్‌మీడియా యాక్టివిస్టులు, ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపులకు పాల్పడిన కూటమి ప్రభుత్వం ఇప్పుడేమో ఏకంగా నిజాలను ప్రచురించే మీడియా/పత్రికలపై కక్ష సాధింపులకు దిగడం హేయమైన చర్య. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛపై గౌరవ భావం కలిగి ఉండాలి. భయపెట్టి నిజాలను కప్పివేయాలనుకోవడం సరి కాదు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి, ఇతర పాత్రికేయులపై వేసిన కేసులను కూటమి సర్కారు వెంటనే ఉపసంహరించుకోవాలి.

– విరూపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే

పత్రికలపై కేసులు పెట్టడం సరికాదు



పోలీసుల పదోన్నతుల్లో అక్రమాలను వెలుగులోకి తెచ్చినందుకు సాక్షి దినపత్రికపై కూటమి ప్రభుత్వం అక్కసు వెళ్లగక్కుతోంది. అన్యాయంగా కేసులు నమోదు చేసే సంస్కృతికి తెర లేపింది. ఇది ఏ మాత్రం మంచిది కాదు. పత్రికా స్వేచ్ఛ మన ప్రజాస్వామ్యానికి నాలుగో మూల స్తంభం. మీడియా సమావేశంలో నేతలు మాట్లాడిన ప్రసంగాలను పత్రికలో ప్రచురించడం వారి నైతిక ధర్మం. అలాగే సమాజంలో జరుగుతున్న అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లడం పాత్రికేయుల విధి. దీనిని జీర్ణించుకోలేక మీడియాపై, పత్రిక సంపాదకులపై కేసులు నమోదు చేయడం తగదు. ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి వస్తుంది.

– పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎంపీ, నంద్యాల

ఆదర్శ బడి .. అవస్థల ఒడి!

- ఇరుకు గదుల్లో తరగతులు
- పెచ్చులూడి పడిపోతున్న పైకప్పు
- విద్యార్థులకు తప్పని నేలబారు చదువులు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం


పాఠశాల పై కప్పు పెచ్చులూడి పడిన దృశ్యం

కోసిగి: పేరుకే అది ఆదర్శ పాఠశాల. అందులో కనీస సౌకర్యాలు లేవు. విద్యార్థులు నేలపైనే కూర్చొని పాఠాలు వినాల్సి వస్తోంది. తరగతి గదుల పైకప్పు పెచ్చులూడి పడిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మోడల్ పాఠశాలకు ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. బోధన సామగ్రిని అందించలేదు. మండల కేంద్రమైన కోసిగి నుంచి 3 కిలో మీటర్లు దూరంలో సజ్జలగుడ్డం రోడ్డులోని పొలాలలో ఏపీ మోడల్ స్కూల్ ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో 2014 నుంచి నూతనంగా తరగతి గదుల నిర్మాణం చేపట్టి విద్యను ప్రారంభించారు. ఇక్కడ 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 530 మంది విద్యార్థులు చదువుతున్నారు.

'నడక' నరకయాతన

ఏపీ మోడల్ స్కూల్ కోసిగి గ్రామానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉంది. పాఠశాల వెళ్లేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు రోజు నరకం చూస్తున్నారు. కోసిగి నుంచి రైల్వేగేటు మీదుగా కాలినడక, మరికొందరు గాంధీనగర్ నుంచి పొలాల్లో పాఠశాలకు వెళ్తున్నారు. సజ్జలగుడ్డం గ్రామం మెయిన్ రోడ్డు నుంచి పాఠశాల వద్దకు వెళ్లే దారి వర్షం వస్తే నడవడానికి వీలు లేకుండా చిత్తడిచిత్తడి మారుతోంది. దీంతో ప్రతి రోజు తీరని అవస్థలు పడుతున్నారు. కోసిగి నుంచి పాఠశాలకు విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

వసతి.. దుస్థితి

ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్‌లో 9,10, ఇంటర్మీడియట్ చదువుతున్న గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులకు కోసం హాస్టల్ వసతి ఏర్పాటు చేశారు. మొత్తం 100 మందికి గాను 84 మంది ప్రస్తుతం ఉన్నారు. హాస్టల్ పై భాగంలోని ఐదు గదులు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉనప్నాయి. ఒక గదిలో నలుగురు విద్యార్థులు ఉండాల్సిన ఉంది. అయితే ఆరుగురు చొప్పున ఉండాల్సి దుస్థితి ఏర్పడింది.


ఒకే గదిలో కూర్చున్న 6వ తరగతి రెండు సెక్షన్లు


బురదలో మోడల్ స్కూల్‌కు వెళుతున్న విద్యార్థులు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాల రెండో అంతస్తు పైకప్పు ప్రమాదకరంగా ఉంది. ముందస్తుగా గమనించి ఆ గదులకు తాళాలు వేయించాం. విదార్థులు అటు వైపు వెళ్లకుండా చూస్తున్నాం. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కింది భాగంలోనే ఉన్న తరగతి గదుల్లో రెండు సెక్షన్లను కలిపి విద్యను బోధిస్తున్నాం.

– సుందర్ కుమార్, ప్రిన్సిపాల్

ఇవీ సమస్యలు..

- పాఠశాల రెండో అంతస్తులోని 7 తరగతి గదులు, ఒక హాల్‌పై కప్పు పెచ్చులూడి కిందకు పడిపోతోంది.
- పాఠశాల తరగతి గదుల పై భాగంలో గోడలు కూడా చీలకలు ఏర్పడ్డాయి.
- ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల వేళలోనే ఒక్క సారి తరగతి గది పెచ్చులూడి పడిపోవడంతో పెద్ద శబ్దం వచ్చింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురయ్యారు. ఆ గదిని వాడకుండా ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.
- ఏడాది పాటుగా కొన్ని గదులు, ఒక హాల్‌కు తాళం వేసి నిరుపయోగంగా వదిలేశారు.
- ఒక తరగతికి చెందిన రెండు సెక్షన్లను ఒకే గదిలో, మరికొన్ని క్లాసులు సైన్స్ ల్యాబ్‌లో నిర్వహిస్తున్నారు.
- విద్యార్థులకు కూర్చునే బల్లలు లేవు. దీంతో 6,7వ తరగతి విద్యార్థులను నేల పైనే కూర్చొబెడుతున్నారు.
- పాఠశాల అటవీ ప్రాంతంలో ఉండటంతో విష పురుగుల సంచారం కనిపిస్తోంది.



ఆర్టీసీ బస్సు తగిలి యువకుడి మృతి

- మరొకరికి గాయాలు
- బైక్‌పై వెళ్తుండగా హొళగుంద సమీపంలో ఘటన


తీవ్రంగా గాయపడిన రంజిత్‌కుమార్

హొళగుంద: ఆర్టీసీ బస్సు తగిలి ఓ యువకుడు మృతి చెందగా..మరొకరు గాయపడ్డారు. శుక్రవారం హొళగుంద సమీపంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని పెద్దహ్యాట గ్రామానికి చెందిన రంగస్వామి, మంగమ్మ దంపతులకు ముగ్గురు ఆడపిల్లల తర్వాత కుమారుడు బోయ రంజిత్‌కుమార్ (18) జన్మించాడు. ఈ యువకుడు హొళగుందలోని ఓ ఫోటో స్టుడియోలో పని చేస్తున్నాడు. శుక్రవారం స్వగ్రామం నుంచి హొళగుందకు వచేందుకు పెద్దహ్యాట క్రాస్ వద్ద సుకువాయి గ్రామానికి చెందిన చిన్న ద్యావన్న అనే వ్యక్తి బైక్ ఎక్కాడు. సుకువాయి రోడ్డు శబరి ఆశ్రమం స్థలం వద్ద ఆలూరు నుంచి హొళగుందకు వస్తున్న ఆదోని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ21జెడ్0341) వారి బైక్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా బస్సు వెనుక భాగం బైక్‌ను తగలడంతో ఇద్దరు అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ ఘటనలో రంజిత్‌కుమార్ ముఖానికి గాయమై నోటిలోనే పళ్లన్ని ఊడి తీవ్ర రక్త స్రావం కాగా మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రంజిత్‌ను హొళగుంద పీహెచ్‌సీకి తరలించగ అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం ఆదోని ఏరియా ఆస్పత్రికి వెళ్లాలన్నారు. అయితే, ఆ సమయంలో108 అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు కారులో తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందించలోగా ఆ యువకుడు ప్రాణాలొదిలాడు. కాగా ప్రమాదం జరిగిన వెంటనే బస్ డ్రైవర్ హనుమంతు బస్సుతో పాటు హొళగుంద పోలీస్ స్టేషన్‌కెళ్లి లొంగిపోయాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న పెద్దహ్యాట గ్రామస్తులు, మృతుడి బంధువులు స్టేషన్‌కు చేరుకొని ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మండి పడ్డారు. మృతుడి తండ్రి రంగస్వామి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రామ్‌నాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా ఒక్కగానొక్క కొడుకు ప్రమాదంలో మరణించడంతో బాధిత కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

సారోళ్లు రాలే!

- 12.30 గంటలైనా తెరుచుకోని వార్డు సచివాలయం

తాళం వేసి ఉన్న ఈ వార్డు సచివాలయం ఆత్మకూరులోనిది. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈ సచివాలయం (7వ నంబర్) శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలైనా తెరుచుకోలేదు. వివిధ పనుల మీద అక్కడికి వచ్చిన ప్రజలు 10.30 నుంచి నిరీక్షించారు. మధ్యాహ్నమైనా తలుపులు తెరుచుకోకపోవడంతో సారోళ్లు ఎప్పుడొస్తారోనని నిరాశతో వెనుదిరిగారు.సచివాలయం తెరవకపోవడానికి కారణమేమిటో తెలుసుకునేందుకు 'సాక్షి' మునిసిపల్ కమిషనర్ రమేష్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు. కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచి సచివాలయ వ్యవస్థపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

–ఆత్మకూరు రూరల్


మధ్యాహ్నం వరకు తెరుచుకోని 7వ సచివాలయం

జల్సాలకు అలవాటు పడి..


అంతర్‌రాష్ట్ర దొంగ నుంచి స్వాధీనం చేసుకున్న బైకులను మీడియా ముందు ప్రదర్శించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

- ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తూ పట్టుబడిన అంతర్‌రాష్ట్ర దొంగ
- రూ.16 లక్షలు విలువ చేసే 32 ద్విచక్ర వాహనాలు రికవరీ
- సీసీ ఫుటేజీ ద్వారా ఛేదించిన పోలీసులు

కర్నూలు : మద్యం, జల్సాలకు అలవాటు పడిన ఓ వ్యక్తి సులువుగా డబ్బు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాల చోరీని ఎంచుకున్నాడు. కర్నూలు నగరంలో భారీగా ద్విచక్ర వాహనాలు చోరీ చేశాడు. రెండు మాసాలుగా సాగుతున్న అంతర్ రాష్ట్ర దొంగ చోరీల పర్వానికి రెండో పట్టణ పోలీసులు చెక్ పెట్టారు. పక్కా ఆధారాలతో నిఘా పెట్టి అతని నుంచి రూ.16 లక్షలు విలువ చేసే 32 ద్విచక్ర వాహనాలను రికవరీ చేశారు. రెండో పట్టణ సీఐ నాగరాజరా వు, ఎస్‌ఐలు సతీష్, మల్లికార్జునలతో కలసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ బాబుప్రసాద్ శుక్రవారం వి లేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

మూడు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్...

తెలంగాణ రాష్ట్రం గద్వాల పట్టణం దౌడురాళ్ల కాలనీకి చెందిన తెలుగు జయంత్ అలియాస్ జశ్వంత్ కర్నూలు సుంకేసుల రోడ్డులోని రెండు వాగుల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడు. పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా అతని నేరాల చిట్టా బయటపడింది. అతని వద్ద నుంచి 32 బైకులను పోలీసులు రికవరీ చేశారు.

సీసీ ఫుటేజీ ద్వారా కేసు ఛేదన..

కర్నూలు నగరంలోని భూపాల్ కాంప్లెక్స్ దగ్గర పార్కు చేసి ఉంచిన బైక్ చోరీకి గురైందని లక్ష్మీనగర్‌కు చెందిన నిరంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. అదే సమయంలో నగరంలోని పలు ప్రాంతాల్లో కూడా బైకులు చోరీకి గురైనట్లు వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు కావడంతో నగరంలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని సీసీ ఫుటేజీలను జల్లెడ పట్టారు. వీటి ఆధారంగా దొంగను పట్టుకున్నారు. చోరీ చేసిన బైకులను జయంత్ తన సొంత ఊరులోని రహస్య ప్రదేశంలో దాచి ఉంచి ఖర్చులకు డబ్బులు అవసరమైనప్పుడల్లా వాటిని రూ.5 వేలు, రూ.10 వేలకు విక్రయించి ఆ డబ్బులతో జల్సాలు చేసేవాడు. కర్నూలులోని ముఖ్య కూడళ్లు, హోటళ్లు, ఇళ్ల దగ్గర పార్కు చేసిన బైకులను ఇతను దొంగలించినట్లు దర్యాప్తులో అంగీకరించాడు. గతంలో హైదరాబాదు, కర్ణాటక ప్రాంతాల్లో కూడా బైకులు చోరీ చేసి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ నేరాల బాట పట్టాడు. రికవరీ చేసిన బైకులను ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన బైకు దొంగతనాల కేసుల ఆధారంగా బాధితులకు అప్పగిస్తామని డీఎస్పీ వెల్లడించారు. భారీ మొత్తంలో చోరీకి గురైన బైకులను రికవరీ చేసి మోస్ట్ వాంటెడ్ బైక్ దొంగను అరెస్టు చేసినందుకు క్రైం పార్టీ పోలీసులను, దర్యాప్తు అధికారులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఫీజు బకాయిలు చెల్లించాల్సిందే!


- స్పందించకపోతే ఈనెల 20 నుంచి కాలేజీల మూసివేత.. నిరవధిక నిరాహార దీక్షలు
- ప్రభుత్వానికి ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం అల్టిమేటం
- ఉమ్మడి జిల్లాలో 86 కళాశాలలకు సుమారు రూ.350 కోట్ల బకాయి

కర్నూలు కల్చరల్: కూటమి ప్రభుత్వం తీరుపై రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. డిగ్రీ కళాశాలలకు ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లించకపోవడంపై కన్నెర్ర జేస్తోంది. ఈనెల 20 తేదీలోగా సర్కారు స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను నిరవధికంగా మూసివేస్, నిరవధిక నిరాహార దీక్షలు చేపడతామని యాజమాన్యాలు అల్టిమేటం జారీ చేశాయి.

బకాయి సుమారు రూ. 350 కోట్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 86 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. రెండు సంవత్సరాలకు సబంధించి సుమా రు రూ. 350 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి చెల్లించాల్సిఉందని యాజమాన్యాలు వాపోతున్నాయి. అంటే ఒక్కో కళాశాలకు సుమారు రూ. 3.50 నుంచి రూ. 4 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిగ్రీ,ఇంజినీరింగ్, బీఈడీ, ఫార్మసీ కళాశాలలకు సంబంధించి సుమారు రూ.650 కోట్లు బకాయి ఉందని ఆయా యాజమాన్యాలు వాపోతున్నాయి.

కళాశాలలను మూసేసుకునే పరిస్థితి



ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో కళాశాలలను నిర్వహించలేక మూసేసుకునే పరిస్థితి దాపురించింది. అధ్యాపకులకు జీతా లు చెల్లించలేని పరిస్థితుల్లో యాజమాన్యాలు ఉన్నాయి. అడ్మిషన్ల విషయంలో ఉన్నత విద్యా మండలి నిర్లక్ష్యం వహించడంతో ప్రవేశాలు 50 శాతం కూడా దాటడం లేదు. తక్షణం ప్రభుత్వం నిధులను విడుదల చేసి ఆదుకోవాలి. లేదంటే ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి ఉద్యమ కార్యాచరణను ప్రారంభిస్తాం.

– గుర్రాల వెంకట రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి, ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్

పథకం ప్రకారమే మద్యం తాపించి హత్య

- స్నేహితుడి గొంతు కోసి చంపిన కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్‌ఐలు

కోడుమూరు రూరల్: మద్యం మత్తులో తోటి స్నేహితుడిని గొంతు కోసి హత్య చేసిన కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపారు. కోడుమూరు సీఐ తబ్రేజ్ తెలిపిన మేరకు వివరాలు... కోడుమూరు మండలం వెంకటగిరికి చెందిన హతుడు బోయ గిరి(26), దూదేకుల మౌలాలి అనే వ్యక్తులు ప్రాణ స్నేహితులు. ఇద్దరు కర్నూలులో ఒకే రూమ్‌లో ఉంటూ జేసీబీ డ్రైవర్లుగా పనిచేసేవారు. అయితే దూదేకుల మౌలాలికి సొంత అన్న మధ్య హతుడు బోయ గిరి తరచూ గొడవలు పెట్టడంతో పాటు అతని తల్లిని దూషిస్తూ మాట్లాడేవాడు. దీన్ని మనసులో ఉంచుకున్న మౌలాలి ఓ పథకం ప్రకారం ఈనెల 6న గిరిని కోడుమూరులోని మద్యం దుకాణానికి తీసుకొచ్చి పూటుగా మద్యం తాపాడు. అనంతరం ప్లాన్ ప్రకారం మౌలాని వెంట తెచ్చుకున్న కత్తితో గిరి గొంతుకోసి హత్య చేశాడు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన కోడుమూరు ఎస్‌ఐ ఎర్రిస్వామి, ట్రైనీ ఎస్‌ఐ మణికంఠ, సిబ్బందిని ఈ సందర్భంగా సీఐ ప్రత్యేకంగా అభినందించారు.


న్యాయం కోసం..

- చాకలి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని రోడ్డుపై బైఠాయించిన బాధిత మహిళ బంధువుల, గ్రామస్తులు
- 5 గంటల పాటు నిలిచిపోయిన వాహనాలు


రహదారిపై బైఠాయించిన శ్రావణి బంధువులు, గ్రామస్తులు


ట్రాఫిక్ జాం అయిన దృశ్యం

దేవనకొండ: న్యాయం కోసం శ్రావణి కుటుంబసభ్యులు, బంధువులు రోడ్డెక్కారు. గురువారం దేవనకొండకు చెందిన చాకలి నరేష్ భార్యపై అనుమానంతో దాడి చేయడంతో పాటు 8 నెలల కుమారుడిని డ్రమ్ములో ముంచి చంపేసిన విషయం తెలిసిందే. క్రూరమృగంగా వ్యవహరించిన నరేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శ్రావణి బంధువులు, గ్రామస్తులు శుక్రవారం కర్నూలు–పత్తికొండ రహదారిపై దేవనకొండ బస్టాండ్ సమీపంలో ధర్నాకు దిగారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆందోళన చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. దేవనకొండ సీఐ వంశీనాథ్, పోలీసులు నచ్చజెప్పినా ధర్నా విరమించకపోవడంతో చివరకు పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఘటనా స్థలానికి చేరుకుని బాధితా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. దాదాపు రెండు గంటల సేపు అక్కడే ఉండి ధర్నాను విరమింపజేశారు. కాగా ఈ సమయంలో పోలీసుల, ఆందోళనకారుల మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. నిందితుడు చాకలి నరేష్‌పై.. భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ విలేకరులకు తెలిపారు.


చెరువు నుంచి పొంగి పొర్లుతున్న నీళ్లు

రాం'జల' పరవళ్లు


ఓవర్‌ఫ్లో చానల్ దగ్గర ఆడుకుంటున్న పిల్లలు

చెరువుల్లో నీరు నిల్వ ఉండటం చూసే ఉంటారు. అయితే ఆదోని పట్టణ సమీపంలోని రాంజల చెరువు నిండి పొంగి ప్రవహిస్తోంది. ఓవర్‌ఫ్లో అయి నీరు ఆవుదూడ వంక మీదుగా వెళ్తున్నాయి. నీరు అధికంగా ఓవర్‌ఫ్లో కావడంతో 2007, 2009లో ఆదోని పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధం అయ్యాయి. దీంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. నీరు పోయే విధంగా ఆవుదూడ వంకలో పూడికతీత పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఇటీవల ఆస్పరి మండలం చిగిళి గ్రామంలో ఆరుగురు పిల్లలు ఈత నేర్చుకోవడానికి వెళ్లి మృతి చెందిన విషయం తెలిసిందే. రాంజల చెరువు గట్టు మీద పిల్లలు ఆడకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిందే.

– ఆదోని సెంట్రల్